ఇన్ఫోగ్రాఫిక్

**ప్రకృతి మనిషికి ఎన్నో గొప్ప కానుకలు ఇచ్చింది. అందులో శరీర వ్యవస్థ ఒకటి. దాని పనితీరే ఓ అద్భుతం. అలుపెరగకుండా పనిచేసే గుండె మొదలు అమూల్యమైన మెదడు వరకు.. మనకు తెలియని నిగూఢ రహస్యాలెన్నో!**

# అద్భుత యంత్రం.. శరీరం!



## అమోఘం.. మెదడు

మనకు రోజుకు సగటున 70 వేల ఆలోచనలు వస్తాయి. మెదడు నొప్పిని గ్రహించలేదు కాబట్టి, రోగులు స్పృహలో ఉండగానే డాక్టర్లు బ్రెయిన్ సర్జరీ చేస్తారు. మెదడులో దీర్ఘకాలిక జ్ఞాపకశక్తి 40 ఏళ్లు వచ్చే వరకు అభివృద్ధి చెందుతూనే ఉంటుంది. పదిలక్షల బిలియన్ల బిట్ల సమాచారాన్ని అది నిల్వ చేసుకోగలదు.



## పరిశ్రమించే గుండె

శరీరంలో అత్యంత కఠినంగా శ్రమించే కండరం గుండె. ఇది మనిషి జీవితకాలంలో 15 లక్షల బ్యారెళ్ల రక్తాన్ని పంప్ చేస్తుంది. దానికే ప్రత్యేకమైన విద్యుత్ ప్రచోదనాన్ని కలిగి ఉంటుంది. అందుకే, శరీరం నుంచి వేరుచేసిన తర్వాత కూడా ఎంతోకొంత సేపు కొట్టుకుంటూనే ఉంటుంది. మనం వినే సంగీత స్వరాలనకు అనుగుణంగా గుండె స్పందన మారుతూ ఉంటుంది.



## పునరపి జన్మం.. చర్మం

శరీరంలో అతిపెద్ద అవయవం చర్మం. ఇది ఎప్పటికప్పుడు కొత్తదనం సంతరించుకుంటుంది. ప్రతి నిమిషానికి 50 వేల కణాలను తొలగించుకుంటుంది. మనిషి జీవితకాలంలో ఈ కణాల మొత్తం బరువు 18 కిలోలకు పైనే ఉంటుంది. మరోమాట... మన బుగ్గలు ఎరుపెక్కినప్పుడు పొట్ట లైనింగ్ కూడా ఎరుపెక్కుతుందట!



## ఎముకల గూడు

మనం పుట్టినప్పుడు 300కు పైగా ఎముకలు ఉంటాయి. పెద్దయ్యాక 206కు తగ్గిపోతాయి. మన ఎముకలు లేత ఇసుక రంగు, లేత గోధుమ రంగులో ఉంటాయి. ప్రయోగశాలల్లోని ఎముకలను ఉడికించి, శుద్ధిచేస్తారు కాబట్టి తెల్లగా కనిపిస్తాయి. మన ఎముక గ్రానైట్ అంత పటిష్ఠంగా ఉంటుంది.



## నాలుక ముద్రలు

వేలిముద్రల్లానే ప్రతి మనిషికీ తనకే ప్రత్యేకమైన నాలుక ముద్రలు ఉంటాయి. మన నోట్లో పదివేల రుచిమొగ్గలు ఉంటాయి. అంతే కాదు, ముక్కు పీల్చే వాసన రుచిమొగ్గలకు కూడా గిలిగింతలు పెడుతుంది.



## హాచ్..హాచ్..

మనిషి తుమ్ము గరిష్ఠంగా గంటకు 64 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించగలదు. అంటే వేగంలో పులితో పోటీ పడుతుంది అన్నమాట!



## జీవామృతం.. నీరు

తన జీవితకాలంలో మనిషి 75 వేల లీటర్ల (రోజుకు 2 లీటర్ల సగటు) నీళ్లు తాగుతాడు. 23,658 లీటర్ల లాలాజలం ఉత్పత్తి చేస్తాడు.

## లక్షల మైళ్లు

మన శరీరంలో రక్తనాళాలు–ధమనులు, సిరలు, రక్త కేశనాళికలు.. అన్నిటినీ పేరుస్తూ పోతే లక్ష కిలోమీటర్ల పొడవు ఉంటాయి. అంటే, భూమధ్య రేఖను రెండున్నర సార్లు చుట్టేయొచ్చు. అదే అన్ని కణాల్లో ఉన్న డీఎన్ఏ పోచలను పేరిస్తే వాటి పొడవు 1,000 కోట్ల మైళ్లు ఉంటుంది. అంటే భూమి నుంచి సౌరకుటుంబంలో చివరిదైన ప్లూటోను దాటిపోతుంది.



## ఇంద్రియ జ్ఞానం

అంధుల దృష్టి నాడులు సాధారణ మనుషులతో సమానమైన సామర్థ్యం కలిగి ఉంటాయి. అలా అంధులు చూడకుండానే స్పర్శ, వినికిడి ద్వారా పరిసరాలను గ్రహించగలుగుతారు.